క్లుప్తంగా

లీకులకు మరమ్మతులు పూర్తి



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే 600 డయా వాటర్ పైపులైన్ ఎయిర్ వాల్వ్ లీకై సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పెద్దఎత్తున తాగునీరు వృథా అవుతున్న విషయం తెలిసిందే. వెంటనే స్పందించిన ఇంజినీరింగ్ అధికారులు ఆదివారం సాయంత్రానికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడంతో పాటు సోమవారం మధ్యాహ్నం నాటికి పూర్తి స్థాయిలో లీకులకు మరమ్మతులు చేపట్టారు.

నీతి కథల పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు నీతి కథలను చెప్పడంలో పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. నీతి కథలను చెప్పించడం ద్వారా విద్యార్థుల్లో సత్ప్రవర్తనతో పాటు ఆలోచించే తత్వం అలవడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యెర్నేని సీతాదేవి మృతికి సంతాపం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ విద్యాశాఖ మంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ యెర్నేని సీతాదేవి మృతిపట్ల రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ సోమవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీతాదేవి నివాసానికి వెళ్లి, కుటుంబసభ్యులను కలిసిన శివాజీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఎన్టీఆర్ మంత్రి వర్గంలో విద్యాశాఖ మంత్రిగా పని చేసిన సీతాదేవి విద్యారంగంలో అనేక సంస్కరణలు తెచ్చారని ఆయన గుర్తు చేశారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: వ్యభిచారం ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరావుపేటలో ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో సోమవారం దాడిచేశారు. నిర్వాహకురాలు, ఇరువురు మహిళలు, ఒక విటుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకురాలిపై కేసు నమోదు చేశారు. ఇరువురు మహిళలను రెస్క్యూ హోమ్‌కు తరలించారు.

ప్రసన్నాంజనేయస్వామికి హిరణ్యాభిషేకం



చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో స్వయంభూగా వెలసిన ప్రసన్నాంజనేయస్వామి వారి 25వ హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం హిరణ్యా భిషేకం నిర్వహించారు. గుండవరం గ్రామానికి చెందిన జి.సాంబయ్య భజన సమాజం వారిచే భజన కార్యక్రమం జరిగింది. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని విద్యార్థిని ఆత్మహత్య

చేబ్రోలు: మనస్థాపానికి గురైన ఇంజినీరింగ్ విద్యార్థిని ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం మల్లవరం గ్రామానికి చెందిన బోయపాటి రేవతి (20) మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. కొద్ది రోజుల క్రితం హాస్టల్ సిబ్బందికి తెలియకుండా రేవతి స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. విషయం తెలుసుకున్న హాస్టల్ సిబ్బంది కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఘటనపై మనస్థాపానికి గురైన రేవతి ఈ నెల 23వ తేదీన ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కోసం గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం విద్యార్థిని మరణించింది. చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.

పుస్తకం.. పూర్తిస్థాయిలో సిద్ధం

గుంటూరుకు ఫుల్ స్టాక్

- పూర్తిస్థాయిలో వచ్చిన నోటు పుస్తకాలు, 8,10 తరగతుల పాఠ్య పుస్తకాలు
- నగరంలోని 212 ప్రభుత్వ స్కూళ్లలోని 28,603 మంది విద్యార్థులకు లబ్ధి
- పాఠశాలలు తెరిచిన రోజునే జేవీకే కిట్ల పంపిణీకి ఏర్పాట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పైసా ఖర్చు లేని నాణ్యమైన విద్యకు భరోసా నిలిచిన జగనన్న విద్యాకానుక(జేవీకే) స్టూడెంట్ కిట్లు గుంటూరు నగరానికి చేరుతున్నాయి. విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన స్టూడెంట్ కిట్‌లో భాగంగా ప్రభుత్వం ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో చేరుకోగా, పాఠ్య పుస్తకాలు ముద్రణా సంస్థల నుంచి విడతల వారీగా వస్తున్నాయి. ప్రభుత్వం పంపిన స్టాక్‌ను పాఠశాలలకు పంపేందుకు వీలుగా గుంటూరులోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో సురక్షితంగా భద్రపరిచారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్న ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది విద్యాకానుక-5 రూపంలో స్టూడెంట్ కిట్లు పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం గత నాలుగేళ్లుగా నిరాటంకంగా విద్యార్థులకు అందించిన జేవీకే స్టూడెంట్ కిట్ వరుసగా ఐదో ఏడాది ఎటువంటి ఆటంకం లేకుండా పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు అందనుంది.

నగరంలో 28,603 మంది విద్యార్థులకు 'కానుక'

గుంటూరు నగర పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా 212 ప్రభుత్వ, నగరపాలకసంస్థ, ఎయిడెడ్, సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న 28,603 మంది విద్యార్థులకు 2024–25 విద్యాసంవత్సరంలో విద్యాకానుక అందించేందుకు విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సరిపడా 1,74,716 నోటు పుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చాయి. అదే విధంగా 8వ తరగతిలో 28,965, పదో తరగతికి 36,311 పాఠ్య పుస్తకాలు వచ్చాయి.

పాఠశాలలు తెరిచే నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం..

జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యాకానుక స్టూడెంట్ కిట్లు పూర్తిస్థాయిలో సిద్ధమవుతాయని గుంటూరు తూర్పు, పశ్చిమ ఎంఈవోలు నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్ చెబుతున్నారు. నోటు పుస్తకాలతో పాటు 8,10 తరగతుల పాఠ్య పుస్తకాలు సైతం పూర్తిస్థాయిలో వచ్చినట్లు చెప్పారు. వచ్చిన స్టాక్ వచ్చినట్లుగా భద్రపరుస్తున్నామని చెప్పారు.



గుంటూరులోని స్టాక్ పాయింట్‌లో భద్రపర్చిన పాఠ్య పుస్తకాలు



ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నోటు పుస్తకాలు



నోటు పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్

పెత్తందార్లకు కొమ్ముకాస్తున్న అధికారులు



మాట్లాడుతున్న పుసులూరి జీవా

నెహ్రూనగర్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన హింసాత్మక సంఘటనలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరిగిన దాడులు చూస్తుంటే ఎలక్షన్ కమిషన్ ఉన్నట్లా, లేనట్లా అని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా ఉండాల్సిన అధికారులు పెత్తందార్లకు కొమ్ముకాస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఉదంతాలు రాష్ట్రంలో తేటతెల్లమయ్యాయన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్, గుంటూరు రేంజ్ డీఐజీ రాజ్యాంగ విరుద్ధంగా ప్రజలకు వ్యతిరేకంగా పెత్తందార్లకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగాలంటే కేంద్ర ఎన్నికల కమిషన్ వెంటనే రాష్ట్ర ఎన్నికల కమిషనర్, డీఐజీని బదిలీ చేయాలని విన్నవించారు. కౌంటింగ్ రోజున అధికారులను అడ్డంపెట్టుకుని పెత్తందారులు చెలరేగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో కౌంటింగ్ జరిగేందుకు సహకరించాలని కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది. ఈసందర్భంగా గత నెల రోజులుగా వివిధ అంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపి, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరం చక్కటి వేదికగా ఉపయోపడిందన్నారు. ఆర్ట్స్, క్రాఫ్ట్స్, తైక్వాండో, కర్రసాము, క్రికెట్, ఫుట్‌బాల్, చెస్, వెస్ట్రన్ డ్యాన్స్, రోబోటిక్స్, సంగీత వాయిద్య అంశాల్లో నిర్వహించిన శిక్షణా శిబిరంలో 175 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ రథినీచౌదరి మాట్లాడుతూ సంప్రదాయ ఆటలతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించేలా విద్యార్థులకు శిక్షణ కల్పించామని తెలిపారు. వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కృష్ణప్రసాద్, రథినీచౌదరి, ఉపాధ్యాయులు

భక్తిరస కావ్యం ఆముక్తమాల్యద



మాట్లాడుతున్న వెంకటశ్రీరంగనాయకి

నగరంపాలెం: ఆముక్తమాల్యద భక్తిరస కావ్యమని ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి అన్నారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై అముక్తమాల్యదపై ఆధ్యాత్మిక ధారవాహిక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరగనున్న ప్రవచన కార్యక్రమాన్ని ఆలయ కమిటి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరంగనాయకి మాట్లాడుతూ కృతిక నిర్మాణానికి కారకులు కుమారరాజు అని అన్నారు. విష్ణుచిత్తులవారి పూర్వాపరాలు గతంలో తెలుసుకున్నామని చెప్పారు. వారు మాలా కైంకర్యాలు చేయడం ప్రారంభించారని తెలిపారు. మాలికలు సమర్పించి వెళ్తుండగా స్వామి వారు ప్రసన్నుడైనారని అన్నారు.

యూరాలజీ విభాగానికి వైద్య పరికరాలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లోని యూరాలజీ విభాగానికి రూ.4.5లక్షల విలువ గల వర్కింగ్ ఎలిమెంట్ వైద్య పరికరాలను అందచేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.మనోహర్‌కు వైద్య పరికరాలను అందచేశారు. మూత్రనాళం నుంచి ప్రోస్టేట్ గ్రంధి తొలగించడానికి, మూత్ర ధార సన్నపడితే సరి చేయడం, మూత్రాశయంలో కణుతులు, రక్తపు గడ్డలు తొలగించేందుకు ఈ వైద్య పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. మూత్రాశయానికి సంబంధించిన వ్యాధులతో బాధ పడే పేద రోగులు ఎక్కువ మంది జీజీహెచ్‌కు వస్తున్నారని, ఆధునిక సేవలు పేదలకు అందించేందుకు వైద్య పరికరాలను అందజేశామన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అస్లాం. డాక్టర్ మొహిసిన్, డాక్టర్ రాకేష్ ప్రదీప్‌లు పాల్గొన్నారు.



డాక్టర్ మనోహర్‌కు వైద్య పరికరాలు అందజేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

దేవరపల్లి ప్రభుదాస్‌కు స్వర్ణ కంకణధారణ

నగరంపాలెం: ఏలూరులోని పాతబస్టాండ్ వైఎంహెచ్ఏ హాల్‌లో శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన అంతర్జాతీయ శతాధిక కవి సమ్మేళనం, పద్యకవుల పట్టాభిషేకంలో తనకు స్వర్ణకంకణ ధారణ చేసి అవార్డుతో సత్కరించినట్లు గుంటూరు బ్రాడీపేటకు చెందిన సాహితీ కళారత్న డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ సోమవారం మీడియాకు తెలిపారు. ఈనెల 26 రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆలపాటి నాగేశ్వరరావు, శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌ల చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ప్రభుదాస్‌కు స్వర్ణకంకణం, అవార్డు అందజేస్తున్న అతిథులు

మర్యాదపూర్వకంగా వ్యవహరించండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: వివిధ సమస్యల పరిష్కారానికి సచివాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 15వ వార్డులోని 19వ సచివాలయంను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఉద్యోగులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు పూర్తయ్యే నేపథ్యంలో అందరూ పౌర సేవలపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

నేటి నుంచి హనుమత్ జయంత్యుత్సవాలు

- హనుమాన్ ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ
- 31న గుంటూరు నగరంలో స్వామివారి గ్రామోత్సవం

నగరంపాలెం: గుంటూరు కొత్తపేట ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 28 నుంచి వచ్చేనెల 2 తేదీ వరకు స్వామి వారి హనుమత్ జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. హనుమాన్ ఉత్సవాల వాల్‌పోస్టర్లను సోమవారం దేవస్థానం ఆవరణలో దేవస్థానం సహాయ కమిషనర్ (ఏసీ)/ఈఓ శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ నూరినేడి దుర్గవరప్రసాద్, శ్రీహనుమాన్ దీక్షా సమాజం గౌరవాధ్యక్షులు తిరువళ్లూరి వెంకటసుబ్బారావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ముఖ్య అర్చక స్వామి తదితరులు ఆవిష్కరించారు. స్వామివారి హనుమజ్జయంతి కార్యక్రమాలకు ఈనెల 28 రాత్రి అంకురార్పణ, 29 ఉదయం 10 గంటలకు లక్ష తులసి పూజ, 30 ఉదయం 10 గంటల కు లక్ష మల్లెల పూజ, 31 ఉదయం 10 గంటలకు లక్ష ఆకు పూజ, రాత్రి 8 గంటలకు శ్రీ హను మాన్ దీక్షా సమాజం ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో శ్రీ స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. జూన్ ఒకటిన హనుమత్ జయంతి సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీ స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం, రాత్రి 8 గంటలకు శ్రీ సువర్చలా ఆంజనేయస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. రెండో తేదీ ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు. దీక్షా సమాజం సభ్యులు నాగేశ్వరరావు, అనీల్‌కుమార్, వంశీ, జగదీష్, సీహెచ్.రమేష్, బాపిరాజు, మారుతీ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏసీ, పాలకవర్గం, హనుమాన్ దీక్షా సమాజం సభ్యులు

పత్రాలు లేని వాహనాలు సీజ్



తెనాలిరూరల్: సరైన పత్రాలు లేని వాహనాలను పోలీసు, రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. పట్టణ బోస్ రోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయ సెంటరులో వన్‌టౌన్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక వాహన తనిఖీలు సోమవారం చేపట్టారు. సరైన పత్రాలు లేని ఏడు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, వన్ టౌన్ సీఐ జి. దశరథ రామారావు మాట్లాడుతూ ప్రతి వాహనదారులు సీ బుక్, లైసెన్సు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. పత్రాలు లేని వాహనాలను నడుపుతూ పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు. పోలీస్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు



తెనాలిఅర్బన్: బెంగళూరుకు చెందిన ఒమేగా రిహాబ్ బృందం సహకారంతో వెన్నెముక లోపాలతో, పుట్టుకతోనే నిలబడలేక, నడవలేక ఇబ్బందులు పడుతున్న 18 మంది దివ్యాంగులకు జిల్లా వైద్యశాలలోని డైక్ సెంటర్‌లో సోమవారం ఉప కరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైక్ సెంటరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు, డాక్టర్ ఇ.ప్రశాంత్ మాట్లాడుతూ ఏడాది నుచి 18 సంవత్సరాలు వయస్సు ఉన్న దివ్యాంగులకు అవసరమైన ఉప కరణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటిని డాక్టర్ దినీష్, కృత్రిమ ఆర్థోసిస్ ఇంజినీర్ తిరుగమ్ పర్యవేక్షణలో తయారు చేసి, అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ విశ్వశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

కాకుమాను: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు అర్హులైన ప్రతి రైతు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని వల్లూరు, చినలింగాయపాలెం, కేబీపాలెం గ్రామాలలోని రైతులకు సోమవారం 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో ఆయా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సబ్సిడీపై రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో కిరణ్మయి

ఎన్‌సీసీ విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన





నంబూరు వీవీఐటీలో ఎన్‌సీసీ విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై శిక్షణ ఇస్తున్న అధికారి వెంకటరెడ్డి, సిబ్బంది

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జరుగుతున్న 10ఏ బాలికల బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరంలో మంగళగిరి అగ్నిమాపక అధికారి వై వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌సీసీ బాలికలకు శిక్షణ ఇచ్చారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణాలు కాపాడుకునే పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అగ్నిమాపక పరికరాలు ఏవిధంగా వినియోగిస్తారో ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. గృహాలలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపిస్తే ఎలా అదుపుచేయాలో చేసి చూపారు. అగ్ని ప్రమాదాల సమయంలో అందుబాటులో ఉన్న పరికరాలను వినియోగించి మంటలు ఏవిధంగా అదుపు చేయవచ్చో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ అధికారి, లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ పట్వాల్, వీవీఐటీ ఎన్‌సీసీ ఆఫీసర్ ఐటీ డాక్టర్ శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు



తెనాలిరూరల్: కౌంటింగ్ సందర్భంగా సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు ప్రజలను హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రూరల్ పోలీసులు మండలంలోని కోపల్లె, గుడివాడ గ్రామాల్లో సోమవారం సాయంత్రం రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐల మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడ వద్దని, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే అసాంఘిక శక్తులను సహించేదిలేదన్నారు. ఎక్కడా అలజడులు లేకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామని, చిన్న వివాదం రేకెత్తినా ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారమందించాలని కోరారు.

అధునాతన చికిత్సలపై శిక్షణ

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. విజయవాడకు చెందిన విధాత హాస్పటల్ వైద్యులు డాక్టర్ కొడాలి ఉమాకాంత్ అధునాతన జ్వరాల చికిత్సలు గురించి, డాక్టర్ ఆలోకం వంశీకృష్ణ మోకీళ్ల మార్పిడి గురించిన అధునాతన సాంకేతిక అంశాలను వివరించారు. అలానే 'విండో పీరియడ్ స్ట్రోక్ అండ్ ఇట్స్ ట్రీట్‌మెంట్' అన్న అంశంపై డాక్టర్ ఎస్.మహీధర్ పలు సూచనలు చేశారు. ఐఎంఏ తెనాలి అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, పావని ప్రియాంక, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ భానుప్రసాద్, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ సుజాత, డాక్టర్ విజయవాణి తదితర వైద్యులు పాల్గొన్నారు.



అధునాతన జ్వరాల చికిత్స గురించి వివరిస్తున్న డాక్టర్ ఉమాకాంత్

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వీడండి



తెనాలిఅర్బన్: పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 37వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే రక్షిత మంచినీరు సరఫరా తీరును పరిశీలించి ప్రతి రోజు సక్రమంగా మంచి నీరు పంపిణీ జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. పైప్‌లైన్‌లో లోపాలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. ఆయన వెంట డీఈ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.